క్లుప్తంగా

నేడు కర్రెమ్మ దేవత బోనాలు

మరికల్: మండల కేంద్రంలోని హరిజన్‌వాడలో మంగళవారం కర్రెమ్మ దేవత బోనాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు రామస్వామి, శివకుమార్, గోపాల్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్ని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

శబరిమలకు బయలుదేరిన భక్తులు



మద్దూరు: అయ్యప్ప మాలధారణ చేసిన అయ్యప్ప భక్తులు సోమవారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. మండలంలోని చింతల్‌దిన్నె ఆంజనేయస్వామి దేవాలయంలో మహేష్ విష్ణు, శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మాలధారులకు ఇరుముడులను కట్టారు. మేళతాళాల మధ్య ఊరేగింపుగా బయలుదేరి శబరి యాత్రకు వెళ్లారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కోస్గి: పట్టణంలోని నీలకంఠస్వామి దేవాలయంలో సోమవారం కురిహినిశెట్టి(జాంద్ర) సమాజం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ ఏడాది సుఖసంతోషాలతో ఉండాలని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బుడ్డప్ప, బసన్న, బుగ్గప్ప, లక్ష్మీనారాయణ, సత్యకుమార్, శేఖర్, భరత్‌కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్త మృతి

మక్తల్: పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్త భీమాచారి సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ట్రాఫిక్ నిబంధనలు అందరూ తప్పక పాటించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఈ-చలాన్ కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. ట్రాఫిక్ చలాన్లను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించిందని.. వినియోగించుకోవాలన్నారు.

- అయ్యప్పస్వామి మాలధారణ అభయమిస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పరిమళగిరిలోని రాఘవేంద్రస్వామి ఆలయ ఆవరణలో జరిగిన మహాపూజలో పాల్గొని మాట్లాడారు. దీక్ష క్రమశిక్షణ వైపు నడిపిస్తుందని పేర్కొన్నారు.
- నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టర్ రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్‌లను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పదో వార్డు పార్టీ ఇన్‌చార్జ్ శరత్‌కుమార్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, పలకలు అందించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, టీఎన్‌జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్ పాల్గొన్నారు.

ముస్లిం ఎంప్లాయీస్ జేఏసీ ఎన్నిక



స్టేషన్ మహబూబ్‌నగర్: టీఎస్ ముస్లిం ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ జిల్లా కమిటీని సోమవారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలు ముస్లిం ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా కన్వీనర్‌గా డాక్టర్ మక్బూల్ అహ్మద్, చైర్మన్‌గా డాక్టర్ మేరాజుల్లాఖాన్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ జహంగీర్‌అలీ, కోశాధికారిగా గౌస్ మొహియొద్దీన్, ప్రచార కార్యదర్శులుగా మంజూర్‌అలీ, అబ్దుల్ రవూఫ్, సంయుక్త కార్యదర్శులుగా ఎండి.అతహర్ అహ్మద్, బారి, ఇబ్రాహీం, అబ్దుల్ ఖాదర్, ఎండి.యూనుస్, మహిళా కార్యదర్శులుగా నూర్‌జహాన్, కౌసర్ జహాన్‌లను ఎన్నుకున్నారు. ముస్లిం ఉద్యోగస్తుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ తన వంతు కృషి చేస్తుందన్నారు.

నేడు నాటక ప్రదర్శన

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా షెడ్యూల్‌కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో సాయంత్రం 5 గంటలకు సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శన నిర్వహించనున్నారు. బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర ఆధారంగా నాటకం ఉంటుందని జిల్లా అధికారి పాండు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



నర్వ పోలీస్ స్టేషన్‌లో కేక్ కట్ చేస్తున్న ఎస్‌ఐ కురుమయ్య



మాగనూర్‌లో ప్యాట ఈశ్వర్ ఆలయంలో భక్తులు

మక్తల్: నియోజకవర్గంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మక్తల్‌లో పడమటి ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ యువకులు టపాసులు కాల్చుతూ కేక్‌లు కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.

మాగనూర్: నూతన సంవత్సరం సందర్భంగా మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలలో ఉన్న దేవాలయాల్లో భక్తులు పోటెత్తారు. మండల కేంద్రంలోని ప్యాటీశ్వర్ ఆలయంలో సోమవారం కావడంతో శివభక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

కొత్త ఏడాది శాంతి యుతంగా ఉండాలి

నర్వ: కొత్త ఏడాది మండల ప్రజలు సుఖ సంతోషాలతో శాంతియుతంగా ఉండాలని ఎస్‌ఐ కురుమయ్య అన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో కేక్‌ను కట్ చేసి పోలీస్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సంతోషాలే మాకు వేడుకలని, ప్రజలు శాంతిభద్రతతో నిరంతరం సురక్షితంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాజేష్, శ్రీకాంత్, యుగేందర్‌రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయమైన రోడ్లు



నేరడగం సమీపంలో రోడ్డుపై కమ్మేసిన కంపచెట్లు

మాగనూర్: మండలంలోని వర్కూర్, నేరడగం వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో పాటు కంపచెట్లతో కమ్మేసింది. దీంతో ఈ రోడ్డు వెంట ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కంపచెట్లు కమ్మేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు అతి సమీపంలోకి వచ్చే వరకు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్కూర్ నుంచి ఉజ్జెల్లి వరకు కంపచెట్లు కుమ్మేయడంతో రోడ్డు మూలమలుపుల వద్ద వాహనదారులు ఎదురెదురుగా వచ్చినప్పుడు ప్రమాదాలు అవుతున్నారు. రోడ్డుపై ఏదైనా పెద్ద వాహనం, లోడ్‌తో వెళ్లే వాహనం వస్తే ఎదురుగు వచ్చే వాహనాలు పక్కకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని పలువురు వాపోతున్నారు. రోడ్డుకు ఇరువైపుల పెరిగిన కంపచెట్లను తొలగించడంతో పాటు రోడ్డుపై గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదమని తెలిసి.. ప్రయాణం

మాగనూర్: రోజు రోజుకూ ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అవేమీ పట్టనట్లు ప్రజలు వ్యవహరిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలలో గూడ్స్ వాహనాలు, ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. మండలంలోని కర్ణాటక సరిహద్దు తళంకేరి గ్రామం మీదుగా నిత్యం పదుల సంఖ్యలో జీపులు, ఆటోలు అధికంగా ప్రయాణికులను ఇరికించి మరీ ప్రయాణం చేస్తున్నారు. దీంతో ఏదైన ప్రమాదం సంభవిస్తే పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తళంకేరి సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న కర్ణాటక ఆటో

భక్తిశ్రద్ధలతో దర్గా ఉర్సు



నర్వ: మండలంలోని జక్కన్నపల్లిలో సోమవారం మహబూబ్ సుభాని ఉర్సు ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పురాతన బుర్జుకోటపై వెలిసిన దర్గా వద్ద ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఆదివారం గంధోత్సవం నిర్వహించి, సోమవారం స్వామి వారికి దట్టీలు, మలీద సమర్పించారు. మొక్కుబడులున్న భక్తులు కందూర్లు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో సోమవారం నోడల్ ఆఫీసర్ నర్సింహరాజు ఆధ్వరంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నర్సింహరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల అభివృద్ధే ధ్యేయంగా ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది పద్మ, సర్పంచ్ మోహన్‌గౌడ్, ఎంపీటీసీ ఉషారాణి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు, మండల అధ్యక్షుడు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ నర్సింహరాజు

రైతుబంధు వెంటనే ఇవ్వండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రైతు బంధు వెంటనే ఇవ్వాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా సమన్వయ కర్త బిచ్చారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో ఎక్కువ శాతం రైతులు వర్షం పై ఆధారపడి వ్యవసాయం చేస్తారని పంటలకు గిట్టు బాటు ధర రాక ఇబ్బందులు పడుతుంటారని అన్నారు. అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటింటికీ శ్రీరాముడి అక్షతలు

మరికల్: అయోధ్య నుంచి వచ్చిన అక్షతలు మండలంలో ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ లక్ష్మీకాంత్, రాజేష్ కోరారు. సోమవారం యువక మండలి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇంట్లో పూజగదిలో ఉంచి 22వ తేదీ వరకు నిత్యం పూజలు చేయాలని గ్రామస్తులకు సూచించారు. పల్లెగడ్డ, ఇబ్రహీంపట్నం తదితర గ్రామాల్లో అక్షతలను పంపిణీచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవర్ధన్, రవి, రమేష్, శివ, చెన్నయ్య, రఘు పాల్గొన్నారు.

అక్షతల శోభాయాత్ర

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్‌లో అక్షతలను సోమవారం ఊరేగింపు చేపట్టారు. రామాలయం నుంచి భజనలు చేస్తూ గ్రామ పురవీధుల్లో చేపట్టారు. 15 రోజుల పాటు శ్రీరామ అక్షతలను గడప గడపకు అందిస్తున్నట్లు తెలిపారు.



బిజ్వార్ అక్షతలను ఊరేగిస్తున్న భక్తులు

రెవెన్యూ గ్రామాల విభజన లేక ఇక్కట్లు

- ఆధార్‌లో ఇతర గ్రామాల పేర్లు
- ఆన్‌లైన్ నమోదులో విద్యార్థులకు ఇబ్బందులు



సమస్యపై అవసలోనిపల్లెలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు (ఫైల్)

ఊట్కూర్: ప్రభుత్వం చిన్న గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసి ఏళ్లు గడిచినా, వాటిని రెవెన్యూ గ్రామాలుగా విభజించకపోవడంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆధార్, పట్టా పాసుపుస్తకాల్లో, ఆదాయ, కుల ధ్రువపత్రాలు, ఆన్‌లైన్ దరఖాస్తుల్లో రెవెన్యూ గ్రామాల పేర్లు వస్తున్నాయి. దీంతో రైతుల, విద్యార్థులు ఆన్‌లైన్ చేయడంలో, బ్యాంకుల్లో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అవుసలోనిపల్లి, మొగ్దుంపూర్ గ్రామాలు రెవెన్యూ గ్రామాలుగా గుర్తించకపోవడంతో ప్రజలు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు.

27 రెవెన్యూ గ్రామాలు

మండలంలో 27 రెవెన్యూ గ్రామాలుగా ఉన్నాయి. దంతన్‌పల్లి, పల్లెకుంట, తిర్మలాపూర్, వెంకటాపూర్ రెవెన్యూ గ్రామాలలో కాలక్రమేణా ప్రజలు నివాసం లేకపోవడంతో బేచిరాక్ గ్రామాలుగా ఉన్నాయి. ఆయా గ్రామాల శివారులో భూములు ఉండడంతో రికార్డుల్లో రెవెన్యూ గ్రామాలుగా కొనసాగుతున్నాయి.

అవుసలోనిపల్లి..

గ్రామం 40 ఏళ్ల క్రితం పంచాయతీగా ఏర్పడింది. గ్రామంలో 350 మంది రైతులకు గాను సుమారు 1,800 ఎకరాలు భూములు కలిగి ఉన్నారు. గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా గుర్తించకపోవడంతో రైతుల భూములు మూడు మండలాల్లోని వివిధ రెవెన్యూ గ్రామాల రికార్డుల్లో నమోదయ్యాయి. ఊట్కూర్ మండలంలోని పెద్దజట్రం, ధన్వాడ మండలంలోని పాతపల్లి, నారాయణపేట మండలంలోని కొల్లంపల్లి రికార్డుల్లో ఉన్నాయి. దీంతో తమ సమస్యల పరిష్కారానికి నారాయణపేట, ధన్వాడ, ఊట్కూర్ తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్తున్నామని రైతులు వాపోతున్నారు.

ఆధార్‌లో గ్రామం పేరు లేక..

గతంలో అవుసలోనిపల్లె గ్రామం పెద్దజట్రం పంచాయతీ పరిధిలో ఉండడంతో ఆధార్ కార్డులలో గ్రామం పేరు పెద్దజట్రంగా నమోదైంది. వీధిపేరు స్థానంలో అవుసలోనిపల్లె పేరు వస్తుంది. కులం, ఆదాయం తదితర ధ్రువపత్రాలతో వారి గ్రామానికి బదులు పెద్దజట్రం పేరు వస్తుంది. దీంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కార్డులలో గ్రామం పేరు లేక పోవడంతో బ్యాంకుల్లో రైతులు రుణాలు పొందలేకపోతున్నారు.

మొగ్దుంపూర్‌లో..

మండలంలోని మొగ్దుంపూర్ గ్రామం 30 ఏళ్ల క్రితం పంచాయతీగా ఏర్పడింది. దాదాపు 300 మంది రైతులున్నారు. వారి భూములు పెద్దజట్రం, ఎర్గాట్‌పల్లి శివారులలో ఉన్నాయి. మొగ్దుంపూర్ గతంలో పెద్దజట్రం పంచాయతీ పరిధిలో ఉండడంతో ఆధార్ కార్డులలో గ్రామం పేరు పెద్దజట్రం వస్తుంది. రెవెన్యూ గ్రామాలుగా గుర్తించి, గ్రామం పేరు ఆధార్ కార్డులకు అనుసంధానం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆన్‌లైన్‌లో గ్రామం పేరు లేదు..



నా కుమారుడు 9వ తరగతి చదువుతున్నాడు. తహసీల్దార్ కార్యాలయంలో కుల ధ్రువీకరణ పత్రం తీయిస్తే గ్రామం పెద్దజట్రం అని వచ్చింది. ఉన్నత చదువులకై ఆన్‌లైన్‌లో గ్రామం పేరు వేరుగా ఉండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

–హన్మంతు, అవుసలోనిపల్లి, ఊట్కూర్

పొంచి ఉన్న ప్రమాదం..



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

- రైల్వే కట్టకోసం తవ్వకాలు
- విద్యుత్ స్తంభాల చుట్టూ మట్టి తొలగింపు
- ఎప్పుడు కూలుతుందోనని స్థానికుల ఆందోళన



కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్‌లైన్

మాగనూర్: మక్తల్ నియోజవర్గంలోని దాసర్‌పల్లి, మాగనూర్, కున్సి గ్రామాల్లో విద్యుత్‌తో ప్రమాదం పొంచి ఉంది. నూతన రైల్వేలైన్ కట్ట పనుల్లో భాగంగా మాగనూర్, కృష్ణా, మక్తల్ మండల పరిధిలోని కట్టలు నిర్మించేందుకు మండల సమీపంలో ఉన్న పొలాల్లో రైతుల ద్వారా భూములు తీసుకుని సుమారు 25నుంచి 30అడుగుల మేరా లోతుతో మట్టిని తవ్వారు. దీంతో ఈ ప్రాంతాల్లో పెద్దఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. అయితే ప్రాంతంలో 33 కేవీ, 11కేవీ విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఈ లైన్లు ఉన్న స్తంభాలను పరిధిలోని 25నుంచి 30అడుగుల మేర లోతున మట్టి తీయడంతో ప్రస్తుతం ఈ విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూలుతుందోనని స్థానికుల్లో భయం నెలకొంది. ఈ స్తంభాలు కూలిపడితే పెద్దఎత్తున ప్రాణనష్టం వాటిలే ప్రమాదం ఉంటుంది. ఈ ప్రాంతాల మీదుగా వ్యవసాయ పనులకు నిత్యం కూలీలు, రైతులు వెళ్లి వస్తూ ఉంటారు. ఈ విషయం విద్యుత్‌శాఖ అధికారులకు తెలిసిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రారంభమై ముగిసిపోయి ఏడాది కావస్తున్నా ఈ విద్యుత్‌లైన్ల మార్పుకోసం చర్యలు తీసుకోవడం లేదని పలువురు వారిని ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ ప్రమాదాలతోపాటు గాలి దుమారాలు, అకాల వర్షాలకు ఈ విద్యుత్ లైన్లలో ఏమైనా అంతరాయం ఏర్పడితే ఈ విద్యుత్ స్తంభాల వద్దకు సిబ్బంది వెళ్లి ఎలా మరమ్మతులు కొనసాగిస్తారనే దానిపై సందిగ్ధం నెలకొంది. ప్రమాదాలు చోటుచేసుకోకముందే విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అత్యవసర సమయంలో ఇబ్బందులు..



కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే విద్యుత్ స్తంభాలు ఇలా ఉండిపోయాయి. అయితే ఏదైనా అత్యవసర సమయం వస్తే ఇబ్బందులు తప్పవు. సంబంధిత అధికారులు స్పందించి స్తంభాలను మరోచోటుకు మార్చాలి.

– మారెప్ప, మాగనూర్ గ్రామస్తుడు

మరో చోట మారుస్తాం..



రైల్వే కట్ట నిర్మాణంకోసం మట్టితొవ్విన సమయం సంబంధిత కాంట్రాక్టర్‌కు మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ప్రస్తుతం వారు మట్టి స్తంభాల చుట్టు తవ్వడంతో అత్యవసర సమయం మరమ్మతుల పనులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడటం ఖాయం. వాటిని మరోచోటుకు మారుస్తాం.

– దేవేంద్రనాయుడు, విద్యుత్ ఏఈ మాగనూర్

ఆలయాల్లో భక్తుల సందడి



గొల్లపల్లి లలితాంబికా ఆలయంలో భక్తుల పూజలు



గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో..



కందూర్‌లో ..



నవాబుపేట సాయిబాబా ఆలయంలో..

సాక్షి నెట్‌వర్క్: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లోని ఆలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. నవాబుపేట మండల పరిధిలోని మైసమ్మ ఆలయం, గురుకుంట సాయి సన్నిధికి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. అడ్డాకుల మండలంలోని కందూర్ రామలింగేశ్వర స్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. స్వామి వారిని, అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ ఆవరణలో ఉన్న కల్పవృక్షం చుట్టు ప్రదక్షిణలు చేశారు. ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. డీఎస్పీ మహేష్ ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేయించారు. ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్, ఈఓ రాజేశ్వరశర్మ, సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, విండో డైరెక్టర్ బుచ్చన్నగౌడ్ తదితరులు ఉన్నారు. కందూర్ స్టేజీ వద్ద శాఖాపూర్ శివారులో ఉన్న సాయిబాబా ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. మూసాపేట మండల కేంద్రంలోని గుట్టపై రామలింగేశ్వరస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. గుట్టపై ఆహ్లాదకర వాతావరణంలో సేద తీరారు.

జడ్చర్ల పరిధిలో 44వ నంబరు జాతీయరహదారిపై గొల్లపల్లి వద్ద ఉన్న లలితాంబికాదేవాలయం, గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి, పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు వాసవీ కన్యకాపరమేశ్వరి, సత్యనారాయణస్వామి, సకలదేవతల ఆలయాలు సోమవారం భక్తులతో నిండిపోయాయి.

మహమ్మదాబాద్, గండేడ్ మండలాల పరిధిలోని గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహమ్మదాబాద్‌లోని అయ్యప్పకొండ, గంగర్లపహాడ్ హనుమాన్ ఆలయం, శివాలయం, నంచర్ల, గండేడ్, జంగంరెడ్డిపల్లి, వెన్నాచేడ్ సాయిబాబా ఆలయం, మన్సూర్‌పల్లి, భవానీ, హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేకంగా భక్తులు పూజలు చేయించారు.

వేములకు బస్సు వచ్చేనా?



వేముల ముఖచిత్రం

అడ్డాకుల: మూసాపేట మండలం వేములకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. చాలా ఏళ్ల నుంచి మహబూబ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ ఆర్డీనరి బస్సు భూత్పూర్, మూసాపేట మీదుగా వేములకు వచ్చి వెళ్లేది. ప్రతి రోజు రెండు, మూడు ట్రిప్పులు షటిల్ సర్వీసుగా తిరిగేది. రాత్రి వేములలోనే ఉండేది. తర్వాత దాన్ని వేముల మీదుగా దాసర్‌పల్లి వరకు పొడిగించి అక్కడే నైట్‌హాల్ట్ ఏర్పాటు చేశారు. ఈ రెండు గ్రామాలతో పాటు చెన్నంపల్లి గ్రామస్తులు కూడా మహబూబ్‌నగర్‌కు ఇదే బస్సులో వెళ్లేవారు. మూసాపేట వద్ద 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి వేముల వరకు సుమారు 3 కిలోమీటర్ల దూరం ఉండగా అక్కడి నుంచి దాసర్‌పల్లి 1.5కిలో మీటర్ల దూరం ఉంది. నాలుగైదేళ్ల కిందట బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు నిలిపేశారు. లాభాలు రావడం లేదని, రోడ్డు బాగోలేదని, బస్సు ఎక్కే ప్రయాణికుల సంఖ్య తగ్గిందన్న కారణంతో చర్యలు చేపట్టారు. తర్వాత చాలాసార్లు గ్రామస్తులు ఆర్టీసీ అధికారులను కలిసి బస్సు సౌకర్యాన్ని పురుద్ధరించాలని విజ్ఞప్తి చేసినా ప్రారంభించ లేదు. జిల్లా కేంద్రానికి చదువుకోవడానికి వెళ్లే విద్యార్థులు ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయించి మూసాపేట వరకు వచ్చి అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. అత్యవసర సమయంలో ఆటోలు రాకుంటే ఒకరిద్దరు ఉన్నా రూ.రెండు, మూడు వందలు చెల్లించి ప్రత్యేకంగా మాట్లాడుకుని వెళ్లే పరిస్థితి ఉంది.

ఎమ్మెల్యేకు కోరిన గ్రామస్తులు

వేములకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇటీవల వేములకు వచ్చిన ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని గ్రామస్తులు కోరారు. దీంతో ఆయన ఆర్టీసీ అధికారులకు ఫోన్ చేసి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు, మూడు గ్రామాలకు మేలు జరిగే అవకాశం ఉన్నందున బస్సు ఏర్పాటు చేసేలా చూడాలని ఆదేశించారు.

వేములకు నడిచి వస్తున్నాం

దాసర్‌పల్లి, వేముల బస్సును నిలిపేసినందుకు చాలా ఇబ్బందిగా ఉంది. దాసర్‌పల్లి నుంచి ఎక్కడికైనా పోవాలంటే వేములకు నడుచుకుంటూ వచ్చి ఆటోల్లో వెళ్తున్నాం. దీని వల్ల చాలా ఇబ్బందిగా ఉంది. చిన్న పిల్లలతో నడిచి రావడం కష్టమవుతోంది.

–గోవిందమ్మ, దాసర్‌పల్లి

బస్సు వచ్చేలా చేయాలి

మా ఊరికి వచ్చే బస్సును బంద్‌చేయడం వల్ల చాలా ఇబ్బందిగా ఉంది. గతంలో మూడు, నాలుగు సార్లు మాఊరికి బస్సు వచ్చి వెళ్లేది. ఇప్పుడు బస్సు రాకపోవడంతో ఆటోల్లో వెళ్తున్నాం. అధికారులు స్పందించి ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సును పునరుద్ధరించాలి

–కుర్వ సాయమ్మ, వేముల